
# సెకండ్ ఇన్ కమాండ్

"మన జనరల్ మేనేజర్ మహాశయుడేం చేస్తున్నాడో ఆయనకే తెలియటల్లేదు! నిన్న కాదు, మొన్న కాదు - పది రోజుల్నుంచీ చెవిలో యిల్లు కట్టుకొని పోరుతున్నా నా సలహాలు పాటించకుండా, యూనియన్ బెదిరింపులకి లొంగిపోయి, 'లంచ్ అవర్‌లో కాంటీన్ కుర్రాళ్ళు పెద్దాఫీసర్ల గదుల్లోకి కాఫీ టీలూ, కూల్‌డ్రింక్‌లూ తీసుకురారు' అని



ఉత్తర్వులు జారీచేసి పారేశాడు!" అన్నాడు డిప్యూటీ జనరల్ మేనేజర్ రాకేష్ యాదవ్ క్రోధంగా, లంచ్ డబ్బా మూత తీస్తూ.

"లంచ్ అవర్‌లో ఏదో యింత ఎంగిలి పడిన తర్వాత, గదిలో తీరుబడిగా కూర్చుని ఓ కప్పు టీ తాగే సదుపాయం లేకుండా పోయింది!" అన్నాడు మరో డి.జి.ఎమ్. రవీంద్ర షా.

"విరామ సమయంలో కాంటీన్ కుర్రవాళ్ళు ఆఫీసర్ల గదుల్లోకి టీ, కాఫీ, కూల్‌డ్రింక్ వగైరాలు తీసుకువెడ్తోంటే, అక్కడ కాంటీన్‌లో భోజనం చేసేవాళ్ళకి యిబ్బంది కలుగుతోందని యూనియన్ వాళ్ళు ఫిర్యాదు చేస్తే జి.ఎమ్. మట్టుకు ఏం చెయ్యకలడు?" అన్నాడు ఛీఫ్ యింజనీర్ అనంతకృష్ణ.

"న్యాయానికి మనందరమూ కూడా లంచ్ అవర్‌లో కాంటీన్‌కి వెడ్తే బావుంటుంది. అందరితోనూ పరిచయం అవుతుంది, ఆఫీసు సోషలిజమూ అనిపిస్తుంది" అన్నాడు మరో సి.ఇ. రామన్.

"జి.ఎమ్. శాస్త్రి మీ దక్షిణాది వాడు కాబట్టి వెనకేసుకొని వస్తున్నారు! లంచ్ అవర్లో కాంటీన్‌కి పోయి వాళ్ళ మధ్య కూర్చో ఓసారి. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వాళ్ళు విసిరే విసుర్లు వింటే సోషలిజం అంటే ఏమిటో తెలిసి వస్తుంది!" అన్నాడు రాకేష్

యాదవ్.

"సాబ్, అది మనం ఆఫీసులో వారి పట్ల వ్యవహరించే తీరుని బట్టి ఉంటుందను కొంటాను," అని అనాలోచితంగా అనేసి, ఆ తర్వాత నాలిక కొరుక్కున్నాడు రామన్.

"నువ్వు నాలిక కొరుక్కోవలసిన అవసరం లేదు. పని చేయించే అధికారులెప్పుడూ కింది ఉద్యోగులకి శత్రువులే, చండశాసనులే! మనకుండే కొద్దో, గొప్పో గౌరవం ఈ కుర్చీలో కూర్చుని మాట్లాడుతున్నంతసేపే! బయటకి వెళ్ళి వాళ్ల మధ్య గౌరవం సంపాదించుకోవాలంటే, కుర్చీలో కూర్చున్నంతసేపు మెతగ్గా వ్యవహరించడం తప్ప గత్యంతరం లేదు. అలా ఉండడం నాకు చేతకాదు!" – రాకేష్ యాదవ్ రామన్‌కి చురక అంటించాడు.

"మీరు శాస్త్రిగారికి గట్టిగా చెప్పి ఉండవలసింది" అన్నాడు రవీంద్ర షా. రాకేష్ యాదవ్‌కి అప్పుడప్పుడు 'కీ' యివ్వడం రవీంద్ర షా కలవాటే.

"చెప్పానయ్యా, చెప్పాను. ఫ్లాస్కులు తెచ్చుకొని లంచ్ అవర్‌కి చాలా ముందుగానే కాంటీన్ నుంచి కాఫీ, టీలూ తెప్పించుకొని ఉంచుకోమన్నాడు!"

"అమెరికా వాళ్ళ ఆఫీసుల్లో ప్రతీ నడవ చివరా ఓ కాఫీ పెర్కులేటరూ, ఓ జిరాక్సు మెషీనూ ఉంటాయి ఎంచక్కా!" అన్నాడు అనంతకృష్ణ.

"ఆ మాటా అన్నాను. 'అక్కడ ఆఫీసు అధినేత కూడా ఆ పెర్కులేటర్‌లో నీళ్ళు పోస్తాడు. కాఫీ పొడుం వేస్తాడు. కప్‌బోర్డ్ తీసి ఫోమ్ గ్లాసులూ, పంచదార, పాలపొడి పాకెట్లు అన్నీ అమరుస్తాడు. ఏ ఆఫీసరు ముందొచ్చినా యిదే పని చేస్తాడు. మనమైతే పెర్కులేటర్‌కి ఆపరేటర్ కావాలంటాం! ఎక్కణ్ణుంచి తీసుకొస్తాం? ఆఫీసులో ఈ ఏర్పాటు చేసుకొంటే యూనియన్ గొడవ చేస్తుంది' అని మాట దాట వేశాడు"

"ఆయనన్న మాటల్లో నిజం లేకపోలేదు సాబ్!" అన్నాడు రామన్. అని అదోలా మొహం పెట్టాడు.

"అదే! అనవలసింది అనేసి మొహం ఇబ్బందిగా పెట్టడం అలవాటైపోయింది నీకు!" అన్నాడు రాకేష్ యాదవ్ నవ్వుతూ.

"ఉద్యోగుల్ని కాకా పట్టే దృష్టితో వెల్‌ఫేర్ అనే ముసుగులో కాంటీన్‌కి కొంత సొమ్మునిచ్చి, ఉద్యోగులకి రాయితీ ధరలతో ఫలహార, భోజన సదుపాయాలు చేయవచ్చు. కాని కారిడర్లలో కాఫీ మెషీన్లు పెట్టి వాటికి ప్రతినిత్యమూ అయ్యే ఖర్చుని ఎకౌంట్‌లో చూపించడానికి ఆఫీసుకు అధికారం లేదు. ఆఫీసర్లు అప్పనంగా టీ, కాఫీలు తాగేస్తున్నారని ఆనాలు గొడవపెడ్తారు. అవే వెండింగ్ మెషీన్లయితే ఎవ్వరితోనూ గొడవ ఉండదు. ఎవరికి కావలిస్తే వారు నాణెం వేసి కావల్సింది తీసుకొంటారు" అన్నాడు రవీంద్ర షా.

"మీ గుజరాతీలందరూ ప్రతి విషయాన్నీ డబ్బుతో ముడిపెట్టేస్తారు! నీలాంటి వాళ్ళూ,

మన బాస్‌లాంటి వాళ్ళూ ఆఫీసుల్లో ఉంటే చాలు, యింక వ్యవహారాలు నడిచినట్టే! అసలు దమ్ములనేవి ఉంటే ఏ పనైనా చెయ్యొచ్చు!" అన్నాడు రాకేష్ యాదవ్.

అదే సమయంలో 'వివేక్' అనే జూనియర్ ఆఫీసరు గదిలో అడుగుపెట్టి, అందర్నీ విష్ చేసి, "యాదవ్ సర్! జి.ఎమ్.గారు మిమ్మల్ని వచ్చి ఓసారి కలవమన్నారు" అని చెప్పాడు.

"నాకు ఆయనే ఫోన్ చెయ్యొచ్చుగా? అయినా నాకు తెలియకుండా, చెప్పకుండా ఆయన గదికి నువ్వెందుకు వెళ్ళినట్టు?" - రాకేష్ యాదవ్ గదమాయిస్తూ అన్నాడు.

"నేనాయన గదికి వెళ్ళనే లేదు సార్! కాంటీన్‌లో లంచ్ చేస్తూంటే జి.ఎమ్. సాబ్ వచ్చి, నా పక్కన కూర్చుని కాఫీ తాగారు. అప్పుడు మాటల సందర్భంలో మీకు కబురందజెయ్యమని చెప్పారు" అన్నాడు వివేక్ కాస్త డీలా పడిన మొహంతో.

"అలానా?" అంటూ రాకేష్ యాదవ్ దిగ్గున లేచి బయలుదేరాడు, యింక అక్కడ ఉండడానికి మనస్కరించక.

కాంటీన్‌లో జి.ఎమ్.ని జనాలెలా పొగిడారో, ఆయన చాలామందిని ఎలా పలకరించారో - ఆ వివరాలన్నీ మిగిలిన వారికి చెప్పి కాని, ఆ గదిలోంచి బయటకు అడుగు పెట్టలేకపోయాడు వివేక్.

తన గదిలో అడుగు పెట్టిన రాకేష్ యాదవ్‌ని చూస్తోనే, "రండి, కూర్చోండి!" అన్నాడు జి.ఎమ్. శాస్త్రి.

"పిలిచారట?" ముక్తసరిగా ప్రశ్నించాడు రాకేష్ యాదవ్.

"మధ్యప్రదేశ్ 'రీవా' ప్రాజెక్ట్ రిపోర్ట్‌ని మీరు నేను సెలవులో ఉన్నప్పుడు ఢిల్లీ మెంబరుకి పంపించేశారు. ఆ రిపోర్టు మీద కెమిస్ట్రీ సెక్షన్ వాళ్ళ వ్యాఖ్యానం లేదని తిరిగి పంపించేశాడు మెంబరు. ఈ ఉదయం టెలిఫోన్లో చిన్నగా చీవాట్లు కూడా పెట్టాడు. మీరింకా ఆ రిపోర్ట్‌ని తయారుచేస్తున్నారనుకొన్నానేగాని, పంపించేశారని తెలియదు!" - శాస్త్రి మందలింపుగా అన్నాడు.

"ఆ రిపోర్టెంతవరకు వచ్చిందని మెంబర్ అడిగితే వెంటనే పంపించేశాను. అందులో తప్పేముంది?"

"ఉందంటే ఉంది, లేదంటే లేదు. పంపించినందుకు తప్పు పట్టలేను. కాని పూర్తి అధ్యయనం చెయ్యకుండా పంపించడం మంచిది కాదు. కెమిస్ట్రీ సెక్షన్ ప్రయోగాలు చేసి నిర్ధారించిన ప్రక్రియలో ఉత్పత్తి అయిన పదార్థంలో అర్ధశాతం కంటే అపరిశుద్ధత ఉండదన్నారు. ఆ ప్రక్రియని భారీ ఉత్పత్తి కోసం వినియోగించినప్పుడు మీరు సూచించిన విధానం వల్ల అది ఒకటిన్నర శాతానికి పైగా ఉంటుంది"

"వాళ్ళు ప్రయోగశాలల్లో చేసిన దానికీ, మనం భారీ ఉత్పత్తి చేసే యంత్ర పథకాలకీ

ఎప్పుడూ తేడా ఉంటుంది. మన కెమికల్ ఇంజనీర్స్‌కి కెమిస్ట్రీ వాళ్ళు పాఠాలు చెప్పకూడదు!" – రాకేష్ యాదవ్ కాస్త దురుసుగా అన్నాడు.

"మీరన్నమాట నిజమే. ప్రయోగశాలలో ఫలితాలకీ, భారీ యంత్రాలతో వచ్చే ఫలితాలకీ తేడా ఉంటుంది. 'ఫెర్గూసన్' కెమికల్స్ యిదే ప్రోడక్టును ఉత్పత్తి చేస్తోంది. వాళ్ళ ఉత్పత్తిలో ఒక శాతం కంటే కలుషితాలు లేవని మనమే ఒప్పుకున్నాం. అటువంటప్పుడు ఒకటిన్నర శాతం కలుషితాలతో మనం ఉత్పత్తి చేసే పదార్థానికి మార్కెట్ ఎలా ఉంటుందనుకొన్నారు?"

"కెమిస్ట్రీ సెక్షన్ చేసిన ఎనాలిసిస్ మీద నాకు నమ్మకం లేదు. మమ్మల్ని చిన్న చూపు చూడ్డానికి సాధ్యం కాని నియమాలు పెడ్తూంటారు! మీరు కెమికల్ యింజనీర్ అయి వుండీ వాళ్ళనే సమర్థిస్తారు!"

"సమర్థింపు కాదు కాని, నేను ఈ ఉదయం రిపోర్ట్ అంతా చదివాను. మూడో స్టేజిలో మరో 'యాజిటేటర్నీ', యివాపొరేషన్ చాంబర్నీ అదనంగా చేరిస్తే అపరిశుద్ధతని అర్ధశాతం కంటే తగ్గించవచ్చు. అయితే అదనంగా మరో రెండు కోట్లు ఖర్చుపెట్టవలసి వస్తుంది. ఈ విషయాలన్నీ వివరంగా పై అధికారులకి చెప్పవలసిన బాధ్యత మనకుంది. భారీ ఉత్పత్తిలో ఉన్న పరిమితుల్ని కెమిస్ట్రీ సెక్షన్ వాళ్లకి చెప్పవలసిన బాధ్యత ఉంది. మీరు మరో నాలుగైదు రోజులు ఆగి ఉంటే, నేను సెలవు నుంచి తిరిగి రాగానే రిపోర్ట్‌ని చూసి ఉండేవాణ్ణి"

శాస్త్రి తన అజ్ఞానాన్ని వేలెత్తి చూపాడు. నేను నేనే, నువ్వు నువ్వే అన్న భావం వ్యక్తం చేస్తూ అన్నాడు. రాకేష్ యాదవ్ మనసు కుతకుతలాడింది.

"అంటే మీరు లేనప్పుడు నేను రిపోర్ట్ పంపించానని నింద వేస్తున్నారు!" అన్నాడు రోషం ప్రదర్శిస్తూ.

"రిపోర్టును పంపినందుకు నింద వెయ్యటల్లేదు. కెమిస్ట్రీ హెడ్‌కి చూపించకుండా పంపడం మంచిది కాదంటున్నాను. ఆయన వ్యాఖ్యానాలు లేనిదే ఈ రిపోర్ట్ పరిపూర్ణం కాదు. యిప్పుడు మెంబర్‌కి సమాధానం చెప్పుకోవాలి. కెమిస్ట్రీ హెడ్‌ని సముదాయించాలి. మన అధ్యయనం పూర్తి కాలేదని ఒప్పుకోవాలి. మీరూ కాస్త అర్థం చేసుకోవాలి!" అన్నాడు శాస్త్రి అనునయంగా, గొంతు హెచ్చించకుండానే.

"మీరు సెలవులో ఉన్నప్పుడు నేను అఫీషియేట్ చేస్తున్నా, నిర్ణయాలు తీసుకొనే అధికారం నాకు లేదంటున్నారు – అంతేనా?!" – రాకేష్ యాదవ్ మరింతగా రెచ్చిపోతూ అన్నాడు.

"మీరు మాటల్లో మదత పేచీ పెట్టి మాట్లాడుతున్నారు కాబట్టి యిక నాకూ చెప్పక తప్పటల్లేదు. కాంటీన్‌లో యూనియన్ గొడవ నేను సెలవులో ఉన్నప్పుడు జరిగింది.

మరి ఆ విషయమై నిర్ణయం ఎందుకు తీసుకోలేదు?! అది తలనొప్పి వ్యవహారం కనుకనే నేనొచ్చేవరకూ వాయిదా వేశారు. అలాగే మెంబర్ని మెప్పిద్దామనే ఉద్దేశ్యంతో, కంగారుగా, కెమిస్ట్రీ హెడ్కి చూపించకుండా రిపోర్ట్ని ఢిల్లీ పంపించి తలబొప్పి వ్యవహారం చేశారు. హోదాలకి తగ్గ జీతాలు తీసుకొంటూ పెద్ద కుర్చీల్లో కూర్చునేవాళ్ళకి నిర్ణయాలు తీసుకోక తప్పదు. మీరు పూర్తి అధ్యయనం చెయ్యకుండా మెంబర్ అడిగారన్న కంగారులో రిపోర్ట్ పంపించాశారే అనుకొందాం – తప్పు కూడా కాదనుకొందాం. మరైతే పద్దెనిమిది ఫైళ్ళు నేను తిరిగి వచ్చేవరకూ ఎందుకు పెండింగ్లో పెట్టారో చెపితే సంతోషిస్తాను!" – శాస్త్రి నవ్వు చెదరకుండా రాకేష్ యాదవ్ ముఖంలోకి చూస్తూ అన్నాడు.

రాకేష్ యాదవ్కి మాటలు దొరకలేదు. దొరికిపోయినందుకు మనసు బాధగా మూలిగింది. పాలిపోయిన ముఖంతో శాస్త్రి వైపు చూశాడు.

"సరే, వెళ్ళండి. డామేజ్ కంట్రోల్కి నేనే ఏదో ఏడుస్తాను!" అన్నాడు శాస్త్రి.

రాకేష్ యాదవ్ మౌనంగా గదిలోంచి బయటకు అడుగు పెట్టాడు.

ఆ ఆఫీసులో ఒక రోజులో జరిగిన తతంగం మాత్రమే యిది. యిటువంటివి ఎన్నో, ఎందరి మధ్యో.

ఆ తర్వాత ఆర్నెల్లకి కొన్ని ప్రమోషన్లు వచ్చాయి. వాటితో బాటు కొందరికి బదిలీలు కూడా వచ్చాయి. అదే నగరంలో శాస్త్రి గ్రూప్ జనరల్ మేనేజరయ్యాడు. రాకేష్ యాదవ్ జనరల్ మేనేజరయ్యాడు. కాని వెళ్ళి చెన్నైలో ఛార్జీ తీసుకోమన్నారు. అది యాదవ్కి యిష్టం లేకపోయింది. బదిలీ ఆపించమని శాస్త్రిని అడిగాడు.

"మీరు చెన్నై వెడితే అక్కడ మీరే హెడ్గా ఉంటారు. స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోవచ్చు. ఆఫీసునేవిధంగా నడపాలీ అన్న మీ ఉద్దేశ్యాల్ని అమలుపర్చడానికి వీలుంటుంది. సంస్థకి అది ఎంతో మంచిది. మీ భవిష్యత్ని దృష్టిలో ఉంచుకొని, చెన్నై వెళ్ళి ఛార్జి తీసుకోండి" అని శాస్త్రి హితవు చెప్పాడు.

కాని రాకేష్ యాదవ్ ఓ రాజకీయ నాయకుడి ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి, ఆ నగరం వచ్చే అతన్ని చెన్నైకి బదిలీ చేయించి,తను మట్టుకు అక్కడే ఛార్జి తీసుకున్నాడు. అతడు చెప్పిన కారణాలు – పిల్లల చదువుకి భంగం కలుగుతుందనీ, ఒక ప్రత్యేకమైన దీర్ఘరోగంతో బాధపడ్తున్న తండ్రికి ఆ నగరంలో తప్ప వైద్య సదుపాయం లేదనీ!

అయితే అసలు కారణం ఊహించుకోవడం కష్టం కాదు. సెకండ్ ఇన్ కమాండ్గా బాధ్యతల్ని తెలివిగా తప్పించుకొంటూ, విరివిగా విమర్శలు చేసే వీలు ప్రథమ అధికారిగా కుర్చీలో కూర్చుంటే ఉండదు! నేనైతేనా...? అని అనడానికి అలవాటు పడ్డ యిటువంటి వాళ్లకి దేశంలో కొదవలేదు.